ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

రిపబ్లిక్ సినిమా CINEMA

రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు..
శ్రీవారికి ఆహ్వానం

మంత్రాలయం, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఈనెల 8 నుంచి 14 వరకు రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ మఠం అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు.

మంగళవారం తెల్లవారుజామున సీఎం నివాసంలో రాఘవేంద్ర స్వామి మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్ లు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందజేశారు. రాఘవేంద్ర స్వామి జ్ఞాపక ఫలమంత్ర అక్షింతలు అందజేశారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులకు కూడా జ్ఞాపిక ఇచ్చి రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు ఆహ్వానించారు.

గంజాయి సరఫరా చేస్తున్న
అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఈగల్ టీమ్ పట్టుకుంది. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు.

బొలేరో వాహనంలో తరలిస్తున్న 847 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.4.2 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. బొలేరో వాహనంలో 26 బ్యాగుల్లో 411 ప్యాకెట్లుగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో ఒడిశాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి తల్వార్తో పాటు వాహనం, సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాకు అడ్డు వస్తే తల్వార్తో వీరు బెదిరిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

బంజారాహిల్స్‌లో కుంగిన రోడ్డు..
గుంతలో పడిన నీటి ట్యాంకర్

హైదరాబాద్, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1/12లో రోడ్డు కుంగింది. అకస్మాత్తుగా రోడ్డు కుంగడంతో అటుగా వస్తున్న నీటి ట్యాంకర్ అందులో పడిపోయింది.

ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు క్లీనరు తీవ్రగాయాలయ్యాయి. వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగానే రోడ్డు కుంగినట్లు అధికారులు చెబుతున్నారు. కుంగిన చోట రోడ్డు కింద నాలా పైప్లైన్ ఉన్నట్లు గుర్తించారు. రహదారి కుంగడంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాన్ని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

ఆదోనిలో కుండపోత వర్షం..

ఆదోని, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లా ఆదోనిలో తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపైకి భారీగా వర్షపు నీరు చేరింది. మున్సిపల్ మెయిన్ రోడ్, శ్రీనివాస్ భవన్ కూడలి, కోట్ల కూడలిలో మొకాళ్ల లోతు నీరు చేరింది. భారీ వర్షానికి లంగర్ భావి వీధి, హవన్నపేట, కౌడల్పేట్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..
'ఉస్తాద్ భగత్‌సింగ్' పవన్ షెడ్యూల్ పూర్తి

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్. ఈ సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరి హర వీరమల్లు'తో పలకరించిన పవన్కల్యాణ్ అదే జోష్తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్సింగ్ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్ పై ప్రశంసలు కురిపించారు. "మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే" అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా ఇది రానుంది.

వివేకా హత్యకేసు దర్యాప్తు పూర్తయింది:సీబీఐ

దిల్లీ, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైకాపా ఎంపీ అవినాష్రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు అంశంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. కేసు దర్యాప్తు పూర్తయిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఒక వేళ సుప్రీంకోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీబీఐ.. కోర్టుకు తెలిపింది. వివేకా కుమార్తె సునీత తరఫు సీనియర్ కౌన్సిల్ మరో కోర్టులో ఉండటంతో విచారణకు న్యాయవాది సమయం కోరారు. దీంతో ధర్మాసనం విచారణను పోస్ ఓవర్ చేసింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ ధర్మాసనం.. వివేకా హత్యకేసుపై కౌంటర్ పిటిషన్లో మరోసారి విచారణ చేపట్టనుంది.

విశాఖ ఉక్కును సెయిల్లో విలీనం చేసేందుకు కట్టుబడి ఉన్నాం:మాధవ్

గుంటూరు, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్): తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కుని సెయిల్లో విలీనం చేసేందుకుకట్టుబడి ఉన్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గుంటూరు పర్యటనలో భాగంగా అరండల్పేట పార్క్ వద్ద ఛాయ్ పే చర్చ నిర్వహించారు. కూటమి పాలన, కేంద్ర ప్రభుత్వ పథకాలపై స్థానికులతో చర్చించారు. శంకర్ విలాస్ ఆర్వోబీ డిజైన్ల మార్పుపై స్థానిక వ్యాపారులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కోసం కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకుందని, ఉత్పత్తి పెంచటంతో పాటు లాభాల బాట పట్టించేందుకు తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. కార్మికులతో కలిసి విశాఖ ఉక్కుని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ దేశంలో బానిసత్వానికి చిహ్నంలా నిలుస్తున్న పరాయి పాలన ఆనవాళ్లు తీసివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, గుంటూరులో జిన్నా టవర్ పేరు మార్పు అంశం కూడా ఇందులో ఉందని తెలిపారు. జై శ్రీరాం అనే నినాదం ప్రతి హిందువు నోట రావాలని, ఎవరి మతాలను, దేవుళ్లను వారు గౌరవించుకునే స్వేచ్ఛ ఈ దేశంలో ఉందన్నారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఆ ఇద్దరే స్ఫూర్తి.. భారత క్రికెట్ డిక్షనరీ నుంచి ఆ పదాన్ని తీసేయండి:గావస్కర్

టెస్టు క్రికెట్లో 'పనిభారం'పై చర్చ జరుగుతోంది. ఇలాంటి సమయంలో భారత పేసర్ మహ్మద్ సిరాజ్ ఆ అపోహను తొలగించాడని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్లో వరుసగా ఐదు మ్యాచులు ఆడిన సిరాజ్పై సన్నీ ప్రశంసల వర్షం కురిపించాడు. మొత్తం 23 వికెట్లు తీసి టాప్ బౌలర్గా నిలిచాడు. అందుకే, అతడి ప్రదర్శన పైనే కాకుండా.. ఆట పైనా సిరాజ్ నిబద్ధత అద్భుతమని కొనియాడాడు. వర్క్లో శారీరకంగా కంటే మానసికంగా బలోపేతంగా ఉండటం చాలా ముఖ్యమని సిరాజ్ నిరూపించినట్లు గావస్కర్ వెల్లడించాడు. "బౌలర్లే మ్యాచులు గెలిపిస్తారని ఎప్పుడూ చెబుతూ ఉంటారు. వాస్తవంగా వారు కూడా పరుగులు సాధిస్తేనే విజయం ఈజీగా వస్తుంది. తొలి మ్యాచ్లో పరుగులు చేయకపోవడంతో ఓడిపోయారు. కానీ, బౌలింగ్ తోనూ అద్భుతాలు చేయొచ్చని మరోసారి సిరాజ్ నిరూపించాడు. వర్క్ అనే దానిని పక్కన పెట్టేసేలా సిరాజ్ బౌలింగ్ చేసిన తీరు అద్భుతం. ఈ పదాన్ని భారత క్రికెట్ డిక్షనరీ నుంచి తొలగించాలి. ఇదే విషయాన్ని ఎప్పట్నుంచో చెబుతున్నా. వరుసగా ఐదు టెస్టు మ్యాచుల్లో 6 ఓవర్లు, 7 ఓవర్లు, 8 ఓవర్ల స్పెల్లు సిరాజ్ వేశాడు. కెప్టెన్ ఎప్పుడు బంతి ఇచ్చినా కాదనకుండా బౌలింగ్ చేశాడు. అతడి నుంచి దేశం కూడా అదేస్థాయిలో ఆశించింది. అందుకే ఒక్కోసారి 'వర్క్' అనేది శారీరకంగా కంటే మానసికంగా చాలా ముఖ్యం" అని గావస్కర్ వెల్లడించాడు.

అవన్నీ మరిచిపోవాల్సిందే..

"వర్క్ విషయంలో తలొగ్గితే.. ఫీల్డ్కి అత్యుత్తమ ప్లేయర్లను బరిలోకి దించలేం. అలాంటి పరిస్థితులు వస్తే మీరు ఒకటే మాట చెప్పాలి. 'హలో, నువ్వు దేశం కోసం ఆడుతున్నావు. అలాంటప్పుడు కండరాల నొప్పులు, బాధలను మరిచిపోవాలి. సరిహద్దులో జవాన్లు ఇలాగే ఉంటారా? ఎప్పుడైనా చలిగా ఉందని ఫిర్యాదులు చేశారా? అక్కడ ఎలాంటి పరిస్థితులైనా సరే దేశం కోసం జీవితాలను త్యాగం చేస్తారు. అలాంటప్పుడు మీరు అత్యుత్తమ ప్రదర్శన చేయలేరా? ప్రమాదాలు జరిగినప్పుడు ఎదురైన గాయాల గురించి ఆందోళన చెందొద్దు. రిషభ్ పంత్నే చూడండి. పాదానికి ఫ్రాక్చర్ అయినా సరే బ్యాటింగ్కు వచ్చాడు. మీ నుంచి కూడా జట్టు ఇదే ఆశిస్తుంది. చిన్నచిన్న గాయాలకే పక్కన కూర్చోవాలని అనుకోవద్దు. మీరు 140 కోట్ల భారతీయుల అంచనాలను మోస్తున్నారని గుర్తు పెట్టుకోవాలి. అదొక గౌరవంగా భావించాలి. సిరాజ్ను చూడండి వరుసగా ఐదు టెస్టులు ఆడాడు. నాన్ స్టాప్ గా బౌలింగ్ చేశాడు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

ఆరోగ్యం

మహిళలతో పోలిస్తే భిన్నం, షుగర్ ఉంటే మగవారిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో తెలుసా?

మహిళలతో పోలీస్తే మగవారిలో డయాబెటిస్ లక్షణాలు కొన్ని భిన్నంగా ఉంటాయి. షుగర్ వ్యాధి ఉన్నప్పుడు మగవారిలో కనిపించే లక్షణాలేంటి, వాటిని ఎలా గుర్తించాలి అన్న పూర్తి వివరాలు ఇప్పుడు చుద్దాం.

ప్రస్తుత జనరేషన్లో డయాబెటిస్ ముప్పు వేగంగా పెరుగుతుంది. రోజు రోజుకి పెరిగిన కేసుల సంఖ్య ఇందుకు సాక్ష్యం. మధుమేహం వ్యాధికి సరైన చికిత్స లేదు. అయితే, జీవనశైలిలో మార్పులు, ఆహారంపై పట్ల శ్రద్ధ తీసుకుంటే డయాబెటిస్ నియంత్రించవచ్చు. ఇన్సులిన్ హార్మోన్ అసమతుల్యత వల్ల కలిగే ఈ వ్యాధి కారణంగా శరీరం కొన్ని సంకేతాల్ని ఇస్తుంది. ఈ సంకేతాల్ని పట్టించుకోకపోతే తీవ్రమైన వ్యాధుల ముప్పు కలుగుతుంది. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధి, నరాల దెబ్బతినడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. పురుషులలో మధుమేహం యొక్క కొన్ని సంకేతాలు మహిళలతో పోలీస్తే భిన్నంగా ఉండవచ్చు. ఆ లక్షణాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

తరచుగా మూత్రవిసర్జన

దయాబెటిస్ ఉంటే శరీరంలో కనిపించే సాధారణ లక్షణం తరచుగా మూత్ర విసర్జన. రక్తంలో చక్కెర స్థాయి పెరిగినప్పుడు, మూత్రపిండాలు అదనపు గ్లూకోజ్‌ను మూత్రం ద్వారా బయటకు పంపడానికి ప్రయత్నిస్తాయి. దీని కారణంగా, రాత్రిపూట కూడా చాలాసార్లు మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. పగటి పూట కూడా ఈ సమస్య కనిపించవచ్చు. మీరు కూడా తరచుగా మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంటే అది దయాబెటిస్‌కి సంకేతం కావచ్చు. వైద్యుణ్ని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిది.

అధిక దాహం

తరచుగా మూత్ర విసర్జన చేయడం వల్ల శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. దీని కారణంగా దాహం ఎక్కువగా వేస్తుంది. ఇది రాత్రి సమయాల్లో కూడా కనిపిస్తుంది. ఇది దయాబెటిస్‌కు ముఖ్యమైన సంకేతం. మీరు నీరు ఎక్కువగా తాగుతున్నప్పటికీ.. దాహం వేస్తుంటే ఇది రక్తంలో పెరిగిన షుగర్ లెవల్స్‌కి సంకేతం కావచ్చు. ఈ లక్షణం కనిపించిన వెంటనే అప్రమత్తం అయి పరీక్షలు చేయించుకుంటే మంచిది.

అలసట, బలహీనత



షుగర్ వ్యాధి ఉంటే తరచుగా అలసిపోయినట్టు, బలహీనంగా ఉన్నట్టు అనిపిస్తుంది. శరీరం గ్లూకోజ్‌ను శక్తిగా సరిగ్గా మార్చుకోలేకపోవడం వల్ల ఇది జరుగుతుంది. ఇన్సులిన్ లేకపోవడం లేదా నిరోధకత కారణంగా.. కణాలు అవసరమైనంత శక్తిని పొందలేవు.. దీని కారణంగా ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపిస్తుంది. చిన్న చిన్న పనులు చేసినా, వాకింగ్ చేసినా, మెట్లు ఎక్కినా అలసిపోయినట్టు అనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దు. అంతేకాకుండా మీరు తగినంత నిద్రపోయినా.. మీకు అలసట, బలహీనత అనిపిస్తే అది దయాబెటిస్ సంకేతం కావచ్చు.

ఆకస్మికంగా బరువు పెరగడం, తగ్గడం



ఉన్నట్టుండి బరువు తగ్గడం లేదా బరువు పెరగడం కూడా దయాబెటిస్‌కు సంకేతం కావచ్చు. టైప్-1 దయాబెటిస్‌లో.. శరీరం గ్లూకోజ్‌ను సరిగ్గా ఉపయోగించలేదు. దీని వల్ల.. కండరాలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. దీంతో, కొవ్వు వేగంగా తగ్గుతుంది. మరోవైపు, టైప్-2 దయాబెటిస్‌లో, ఇన్సులిన్ నిరోధకత కారణంగా బరువు పెరుగుతారు. ఎలాంటి కారణం లేకుండా మీ బరువులో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

సూప్స్అంగస్తంభన లోపం

పురుషులలో మధుమేహం యొక్క తీవ్రమైన సంకేతం అంగస్తంభన లోపం. రక్తంలో పెరిగిన షుగర్ లెవల్స్ నరాలు, రక్త నాళాలకు నష్టం కలిగిస్తాయి. ఇది పురుషులలో లైంగిక సమస్యలను కలిగిస్తుంది. మధుమేహం కారణంగా రక్త ప్రసరణ దెబ్బతింటుంది. దీని వల్ల ఈ సమస్య వస్తుంది. మీకు అలాంటి సమస్య ఉంటే, అది మధుమేహానికి సంకేతం కావచ్చు. వెంటనే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోవడం ముఖ్యం.



గమనిక

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.